
# అవార్డు కథ



—కోనేరు రాజబాబు

చిత్తుకాగితాల వ్యాపారంలో చెత్తగా సంపాదించిన చలమయ్యగారికిప్పుడు ఎందుకో మనసు మథనపడుతోంది.

ఉప్పచేపల వ్యాపారంలో ఉధృతంగా సంపాదించిన భూషయ్య ఈ మధ్య ఒక సినిమా తియ్యటం - దానికి రాష్ట్రపతి అవార్డు రావడం జరిగింది - అది అంతటితో ఆగక భూషయ్యకు రాష్ట్రమంతటా సన్మానాలు, అభినందన సభలు - టి. వి.లో ఇంటర్వ్యూలు - పేపర్లో పేజీలకు పేజీల కవరేజీ - ఇవన్నీ చలమయ్యను చలింపచేశాయి -

సంపాదనలో భూషయ్యకు ఏ మాత్రం తీసిపోడు - కానీ భూషయ్యకు ఇలా సన్మానాలు జరగడం - తనను ఏదో పాతాళానికి తోసేసినట్టనిపించింది చలమయ్యకు -

తాను కూడా భూషయ్య సినిమాను తలదన్నే సినిమా తియ్యాలి - అంతర్జాతీయ అవార్డులను సాధించాలని - ఇదే అతని ధ్యేయం - అనుకున్నదే తడవుగా మరుసటి రోజే అన్ని పేపర్లలో ప్రకటనలు గుప్పించాడు-

అంతర్జాతీయ అవార్డు పొందగల సినిమా కథను ఇవ్వగల రచయితలకు సదవకాశం - వారు కోరినంత పారితోషికం - కలవవలసిన ప్రదేశము -- తేదీలతో సహా వివరించాడు.

నిర్ణయించిన తేదీ రానే వచ్చింది -

ఇంటర్వ్యూ మొదలయింది -

ఒకాయన సింహం - ఏనుగులతో జంగిల్ పిక్చర్ తియ్యండని కథ చెప్పాడు.

మరొకాయన సెక్స్ పిక్చర్‌కు కథ చెప్పాడు -

ఇంకొకాయన క్రైమ్ పిక్చర్‌కు కథ చెప్పాడు -

మరొకాయన వచ్చి సస్పెన్స్ పిక్చరన్నాడు - తాను కూడా మొదట ఒక ప్రొడ్యూసర్‌గానే ఫీల్డుకు వచ్చానని, రెండు అవార్డు చిత్రాలు తీశాననీ ఇంటి నిండా కప్పులూ - సర్టిఫికెట్‌లు వున్నాయనీ, కానీ డబ్బులు అయిపోయినాయనీ, అప్పటినుంచి కథలు వ్రాసి బ్రతుకుతున్నాననీ చెప్పాడు -

ఆ మాటలు చలమయ్యకు రుచించలేదు -

చలమయ్యకు తలనొప్పి మొదలయింది - ఎవరు చెప్పినా ప్రేమకథలు, సెక్స్ కథలు, క్రైమ్ కథలే!

చివరకు ఒక రచయిత వచ్చాడు.

"మంచి అవార్డు కథ వుందా" అడిగాడు విసిగిపోయిన చలమయ్య.

"ఉంది" రచయిత సమాధానం -

"అయితే చెప్పండి" ఆత్రుతగా అడిగాడు చలమయ్య-

"ప్రపంచంలో ఎక్కడ చూసినా ఎదురయ్యే సమస్య నా కథకు మూలం - డబ్బున్నవాడు - లేనివాడు - ఎక్కువ కులం - తక్కువ కులం వీటికి వారధి వేశాను నా కథతో"

చలమయ్యకు ఏదో కొత్తదనం కనిపించింది -

"కొంచెం వివరంగా చెప్పండి" అడిగాడు చలమయ్య.

"నా హీరో తక్కువ కులంలో పుట్టాడు - అయినా కోటీశ్వరుడు - హీరోయిన్ పెద్ద కులంలో పుట్టింది - కానీ కటిక పేదది - వీరిద్దరూ ఒకరినొకరు గాఢంగా ప్రేమించుకున్నారు - హీరో తండ్రికి డబ్బున్నదన్న అహం - హీరోయిన్ తండ్రికి పెద్ద కులం అన్న ధీమా - ఆ పెళ్ళికి ఎర్రజెండా చూపిస్తారు"

"ఆ తరువాత" ఆత్రుతగా అడిగాడు చలమయ్య.

హీరో ఆ అమ్మాయి లేకుండా నేను బ్రతకలేనంటాడు.

హీరోయిన్ ఆ అబ్బాయే నాకు సర్వస్వం - పెళ్ళంటూ చేసుకుంటే అతన్నే చేసుకుంటానంటుంది -

"ఆ తరువాత" ఆత్రుతగా అడిగాడు చలమయ్య.

"అతన్నే నువ్వు పెళ్ళి చేసుకుంటే నువ్వసలు మాకు పుట్టనే లేదనుకుంటాము" అంటాడు అమ్మాయి తండ్రి.

"కథ మంచి రసపట్టులో వుంది. చెప్పండి" అంటాడు చలమయ్య-

హీరో - హీరోయిన్ ఒక నిర్ణయానికి వస్తారు - ఒక రోజు ఎత్తైన కొండ మీదికి వెళతారు.

"అక్కడి నుంచి దూకుతారా?" అడిగాడు చలమయ్య-

"లేదు - తమ మాటను మన్నించని తల్లిదండ్రులను ఎదిరించి, కులాలు మతాలకు అతీతంగా డబ్బు, హోదాలను త్రోసిరాజని ఆదర్శంగా గుళ్ళో పెళ్ళి చేసుకుంటారు."

చలమయ్య సంతోషానికి అవధులు లేవు - ఇది తప్పకుండా అవార్డు వచ్చే కథే!

"బాగుందయ్యా కవిగారూ! కథ బాగా నచ్చింది.

"కవిగారూ! ఈ రోజు చాలా సుదినం – మీరు కలవడం – మంచి కథ చెప్పడం – పైగా ఇది వాస్తవానికి చాలా దగ్గరగా వుంది – అసలు ధనికుడు, పేద తేడా ఏమిటంటారు. చెప్పండి –

రండి! ఆఫీసు చూద్దురుగాని" అంటూ దారి తీశాడు చలమయ్య.

" ఇది రిహార్సలు గది– రేపు జరగబోయే సీనుని ఈ రోజే రిహార్సలు చేసుకోవచ్చు. ఇది పాత పద్ధతి అనుకోకండి– అయినా దీని వలన కాలాన్నీ వృధా ఖర్చునీ పొదుపు చేయవచ్చు"– ఈ రోజు ఈ పద్ధతి అవలంబించే వాళ్ళే లేరు. అంతా సెట్ మీది కొచ్చాకే" అన్నాడు చలమయ్య.

"చాలా మంచి ఉద్దేశ్యం" మెచ్చుకున్నాడు రచయిత.

"రాణీ! నువ్వు లేకుండా నేను బ్రతకలేను"

"రాజా! నువ్వే నా సర్వస్వం" అంటూ లోపల నుంచి మాటలు వినిపిస్తున్నాయి.

"ఏమిటి! లోపల ఏమైనా రిహార్సలు జరుగుతోందా?" అడిగాడు రచయిత.

వెంటనే తలుపుతట్టాడు.

"చిన్నా–చిన్నా!" ఆగ్రహంగా పిలిచాడు.

క్షణంలో తలుపులు తెరుచుకున్నాయ్.

అబ్బాయి–అమ్మాయి ఎదురుగా ప్రత్యక్షమయ్యారు.

"ఒరేయ్ నీ మీద ఎన్ని ఆశలు పెట్టుకున్నానురా– లక్షణంగా మంచి సంబంధం చూసి కోటీశ్వరుల ఇంటి పిల్లను నీకు భార్యగా తేవాలనుకున్నాను. చూశారా కవిగారూ! ఎక్కడో బికారిదాన్ని మరిగి వీడు నా ఆశలు వమ్ము చేశాడు" ఆవేదన వెలిబుచ్చాడు చలమయ్య.

"ప్రొడ్యూసర్‌గారూ! అనవసరంగా నోరుజారకండి. ఆ అమ్మాయి నా కూతురు. ఇల్లూ కాలేజీ తప్పించి దానికి మరేం తెలియదు. మీ వాడే దానికి ఏవో మాయమాటలు చెప్పి మోసం చేసి వుంటాడు. నీకేంపోయే కాలం వచ్చింది– కులంగాని వాడితో ఇలా ఊరేగడానికి" అంటూ విరుచుకుపడ్డాడు కవిగారు.

చలమయ్యకిప్పుడు ఆశ్చర్యమూ, ఆగ్రహమూ తోడైనాయి.

"కవిగారూ! నాకు మంచి కథ చెప్పావయ్యా. కులం లేదు; మతం లేదు– ధనికుడు లేడు– పేదవాడు లేడని మంచి పథకం వేశావు. నీ కూతుర్ని దొడ్డి దారిన నా కొడుకు దగ్గరకు పంపావు. తెల్లవారేసరికల్లా నీ కూతురుకోటీశ్వరుడి భార్య కావాలనుకున్నావు– గొప్ప తెలివితేటలు ప్రదర్శించావు. ఆశకు కూడా అంతు వుండాలి. క్షణంలో నీ కూతుర్ని తీసుకుని బయటకు నడువు. లేదా నేనేం చేస్తానో నాకే తెలియదు" ఊగిపోయాడు చలమయ్య.

"నాన్నా! మీరనవసరంగా ఎందుకు దెబ్బలాడుకుంటున్నారో మా కర్థం కావడం లేదు" అంటూ ఆశ్చర్యాన్ని వెలిబుచ్చాడు చలమయ్యగారి పుత్రుడు.

"ఇంకేం అర్థం కావాలిరా కళ్ళారా చూసింది చాలక. నా గొంతులో ప్రాణం వుండగా ఈ పెళ్ళికి నేను ఒప్పుకోను" అన్నాడు చలమయ్య.

"మీరు పొరపాటు పడుతున్నారు నాన్నా– మా కాలేజీలో నాటికల పోటీలు వున్నాయి. అందుకే పది రోజుల నుంచీ మేమిక్కడ రిహార్సలు చేసుకుంటున్నాము" అన్నాడు చలమయ్య కొడుకు.

చలమయ్య–కవిగారు ఈ మాటకు తెల్లబోయారు.

"ఇది నువ్వు రాసిన నాటికే నాన్నా –'సమాజానికి చైతన్యం రావాలని'. ఈ నాటికను మా ప్రిన్సిపాల్‌గారు చదివి మెచ్చుకున్నారు. నన్ను కూడా నటించమన్నారు. నేను నటించనంటే మీ నాన్నగారితో నేను చెబుతానన్నారు–" జవాబు చెప్పింది కవిగారి పుత్రిక–

"నిజమే ప్రొడ్యూసర్ గారూ! ఇది నేను వ్రాసిన నాటికే– చాల నాటక పరిషత్తులలో ఉత్తమ రచనగా దీనికి బహుమతి కూడ వచ్చింది. దానినే మీకు సినిమా కథగా చెప్పాను" అన్నాడు కవి.

"సినిమా తీస్తే అవార్డు కూడ తప్పదయ్యా– అనవసరంగా మనిద్దరమూ తొందరపడిపోయాము.

"నాన్నా! ఆగండి" పిలిచాడు తండ్రిని చలమయ్య కొడుకు–

"ఏమిటిరా? మళ్ళీ ఏమయింది?"

"పది నిమిషాల క్రితం మేమిద్దరం రిహార్సలు పెట్టుకునేందుకు మీ గది ప్రక్కగా వచ్చాం. కులం లేదని కవిగారు, ధనికుడు, పేద లేదని మీరు చర్చించుకుంటున్నారు. నిజంగా మా పెద్దవాళ్ళలో ఇలాంటి భావాలు వున్నందుకు పొంగిపోయాం. ఉప్పొంగిపోయాం. కానీ మీ నీతులు ఎదుటవారికి చెప్పేటందుకే కాని, మీరు ఆచరణలో పెట్టేందుకు కాదని ఇప్పుడు మా కర్థమైంది.

యదార్థంగా మేమిద్దరం ప్రేమించుకున్నాము. కులాలు వేరైనా– మతాలు వేరైనా, అంతస్థులు వేరైనా మేము జీవితంలో భాగం పంచుకోందామనుకొంటున్నాము. మీకు ఇష్టం వున్నా లేకున్నా మా నిర్ణయానికి తిరుగులేదు." తమ నిర్ణయాన్ని తెలియజేశాడు చలమయ్య కొడుకు.

చలమయ్య–కవిగారూ అవాక్కయిపోయారు.

తాము చెప్పాలనుకొన్న నీతులు తమనే శూలాలతో పొడిచినట్లనిపించింది వారిద్దరికీ–

"ఏం చేద్దాం కవిగారూ?" ప్రశ్నించాడు చలమయ్య–

"ఆచరణలేని ఆదర్శం కన్నా– ఆదర్శం లేని ఆచరణ ఎంతో గొప్పదని మన చిన్నారులు ఋజువు చేశారు. మన అభిప్రాయాలు మార్చుకొని ఈ కథను సుఖాంతం చేద్దాం బావగారూ!" అన్నాడు కవి–

## మహానది

రాత్రంతా నిద్దరాదు
తలలో ఒక మహానది ప్రవహిస్తూ ఉంటుంది
ధమనుల్లో సిరల్లో నా లోలోపలి పొరల్లో
జ్వరమై స్వరమై
జరజర జారుతూ
సాయంకాలపు పొగలా అంతర్ధానమౌతూ ఉంటుంది

అది నాలో ఆఖరి ప్రకంపన
మూగబోయిన ఒక స్వాప్నిక దార్శనిక వీణ
సంవత్సరాల తరబడి దాన్నెవరూ తాకలేదు

జీవితం హేమంతమై
ఆకునూ ఆకునూ రాల్చి
చివరికి వంటరై మొండిగా విలపించే వేళ
నేను ఉన్మాదినై ఆందోళనతో రోడ్డు మీదకు పరిగెడ్తాను
ఏది? మహానది ఏది? ఎక్కడ?

తుపాకీలో తూటా మహానది
నా గొంతుకలో పాట మహానది
చిన్న చిన్న అడుగులు వేసి నడుస్తున్న మా "శ్వేత" మహానది
తలపండి ప్రేమ నిండిన మా అమ్మ మహానది
మహానది నా గుండె మీద ఓలలాడే పడవ
అది విముక్తి ప్రదాయని "ఓల్గా"
అది నా తల ఒడ్డును క్షాళితం చేస్తున్న కాశీగంగ

నా కలంలో సిరా
నా కంట్లో నెత్తురు
నా గుండెలో బాధ
నా మానసిక గీతం
నా మనో వేదం
మహానది నన్ను దగ్ధం చేస్తున్న మంట
నన్ను దహనం చేసి
నా చితిని తనలో కలుపుకున్న పునీత
పరమ పావని

– విజయచంద్ర